క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సాలూరు: శ్యామలాంబ పండగ నేపథ్యంలో మంగళవారం సాలూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారి సిరిమాను ఉత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సిరిమాను ఊరేగింపు ముగిసే వరకు సిరిమాను తిరిగే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. నాయుడువీధి, అల్లువీధి, శివాజీ జంక్షన్, బోసు బొమ్మ జంక్షన్, మెయిన్‌రోడ్డు, గొల్లవీధి, డీలక్స్ సెంటర్, కోట వీధి, లావుడి వీధి, కరణాల వీధి, పెదకోమటిపేట, డబ్బీవీధి, లావేటి వీధి,దండిగాం రోడ్డు, అఖ్యానవీధి, తోటవీది తదితర ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

బోర్డు సరిచేయండి

పార్వతీపురం రూరల్: మండలంలో పుట్టూరు గ్రామం పేరుతో ఉన్న బోర్డు కిందికి పడిపోయి అధ్వానంగా ఉంది. చుట్టూ తుప్పలు ఏర్పడి ఊరిపేరు సరిగ్గా కన్పించడం లేదు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేసి బోర్డును సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెన్సరాయిలో వైద్యశిబిరం ఏర్పాటు చేయండి

సాలూరు: మండలంలోని డెన్సరాయి గ్రామంలో గిరిజనులు జ్వరాలతో బాధపడుతున్నారని, గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు ఎం.శ్రీను, ఎన్వై నాయుడులు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో వారు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన మర్రి చిన్న, కార్థియా, టిక్కో, పూసే, కుంబే, గీత, కొర్రబూతే, తమ్ము తదితరులు నాలుగు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. తీవ్ర జ్వరాలతో బాధపడుండడం,అంబులెన్స్‌లు లేకపోవడంతో వారు తోణాం పీహెచ్‌సీ లేదా సాలూరు ఏరియా ఆస్పత్రికి రాలేని పరిస్థితి నెలకొందని, అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి, వారికి వైద్య చికిత్స అందించాలని కోరారు.

దళిత విద్యార్థిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

- సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ రంజిత్ కుమార్

పార్వతీపురం: తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న దళిత సామాజిక వర్గాని కి చెందిన జేమ్స్ అనే విద్యార్థిని కుల దురహంకారంతో అపహరించి, నిర్బంధించి దాడిచేసిన వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో నిరంతరం దళితులపై ఏదో ఒక చోట దాడులు నిత్యం ఏదో ఒక రూపంలో జరుగుతునే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. జేమ్స్‌పై దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలనే, అలాగే సకాలంలో బాధితుడికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు



యాగశాలలో పూజలందుకుంటున్న ఆది దేవుళ్లు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో శివాలయం ప్రతిష్టాపన మహోత్సవాలు కంకణాలు కట్టుకున్న భక్తులతో వేద పండితులు ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఆదివా రం జరిగాయి. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆసీనులైన పరమేశ్వరుడు, నందీశ్వరుడి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూజలు జరిగాయి.

శ్యామలాంబ జాతరకు ప్రత్యేక బస్సులు

పార్వతీపురంటౌన్: సాలూరులో సోమవారం నుంచి ఈనెల 21వరకు జరగనున్న శ్యామలాంబ అమ్మవారి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం అలాగే పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆదివారం నుంచి బుధవారం వరకు ఈ ప్రాంతాలనుంచి సాలూరుకు రాకపోకలు సాగించేందుకు 1240 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శ్యామలాంబను దర్శించుకునే భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి 5 నిమిషాలకు బస్సు

సాలూరు శ్యామలాంబ అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం, బుధవారం భక్తుల సౌకర్యార్థం పార్వతీపురం నుంచి సాలూరుకు పార్వతీపురం డిపో నుంచి ప్రతి 5 నిమిషాలకు సాలూరుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు పార్వతీపురం డిపో మేనేజర్ కనకదుర్గ పేర్కొన్నారు.

ఎన్నాళ్లీ.. ప్రయాణ కష్టాలు

- నిలిచిపోతున్న ఆర్టీసీ సర్వీసులు
- గ్రామాలకు రాని బస్సులు
- పార్వతీపురం నైట్‌హాల్ట్ కట్
- వీరఘట్టం – శ్రీకాకుళం ఫస్ట్ బస్ సర్వీస్ నిలిపివేత
- నిలిచిపోయిన విశాఖపట్నం, పొల్ల సర్వీసులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



వీరఘట్టం: మండల ప్రజలకు ప్రయాణ కష్టాలు వెంటాడుతున్నాయి. అవసరమైన ఆర్టీసీ బస్సు సరీ్వసులు లేక నిత్యం ప్రయాణికులతో పాటు వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం నుంచి రాత్రి 9 గంటలు దాటిన తర్వాత వీరఘట్టానికి బస్సు సర్వీసులు లేవు. అలాగే వీరఘట్టం నుంచి ఉదయం ఆరు గంటల వరకు పార్వతీపురం వెళ్లేందుకు బస్సులు కూడా లేవు. పార్వతీపురం నుంచి వీరఘట్టం వచ్చే నైట్‌హాల్ట్ బస్సు రద్దు చేశారు. వీరఘట్టం నుంచి పొల్ల, నీలకంఠాపురం వెళ్లే బస్సు సర్వీసులతో పాటు వీరఘట్టం నుంచి ఉదయం 5 గంటలకు విశాఖపట్నం వెళ్లే బస్సు సర్వీసును కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. ఇలా వీరఘట్టం రావడానికి.. ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే పలు సర్వీసులను రద్దు చేయడంతో మండల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వీరఘట్టం మండలం కేంద్రం సీతంపేట, వంగర, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండంలోని కొన్ని గ్రామాలకు వ్యాపార కేంద్రంగా ఉంది. అందుచే నిత్యం ఈ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వీరఘట్టం వస్తుంటారు. అయితే వీరు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలు ఆశ్రయిస్తున్నారు. గతంలో ఈ రూట్‌లలో నిత్యం ఆర్టీసీ బస్సులు తిరిగేవి. కాలక్రమేణా ఈ రూట్‌లలో తగినంత ఆదాయం రావడం లేదని ఆర్టీసీ అధికారులు బస్సులు నిలిపివేశారు.

ఇదీ పరిస్థితి..

మారుమూల గ్రామాలకు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నప్పటికీ.. వీరఘట్టం మండల కేంద్రం నుంచి మాత్రం పలు రూట్ బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. సుమారు 18 వేల మంది జనాభా ఉన్న వీరఘట్టం మేజరు పంచాయతీలో నిత్యం 500 మంది ఉదయం తెల్లవారు జామునే ఉద్యోగం, వ్యాపారం, చదువు, వైద్యం నిమిత్తం పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వెళుతున్నారు. అయితే ఉదయం 5 గంటలకు విశాఖపట్నం, శ్రీకాకుళం పట్టణాలకు ఆర్టీసీ సర్వీసులు లేవు. దీంతో వీరంతా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒకవేళ రాత్రి పూట వీరఘట్టం రావాలన్నా ఇబ్బందే. నైట్‌హాల్ట్ బస్సులు లేవు. ఇలా మండల ప్రజలతో పాటు సమీప మండలాల ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు.

రద్దయిన బస్సు సర్వీసులు ఇవే..

వీరఘట్టం మీదగా పొల్ల వెళ్లే బస్సు చాలా రోజుల కిందట రద్దు చేశారు. దీంతో వీరఘట్టం, సీతంపేట మండలాల్లో ఉన్న 40 గ్రామాల గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అలాగే వీరఘట్టం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు సర్వీసును ఏడాది కిందట రద్దు చేశారు. దీంతో ఈ ప్రాంతాల నుంచి వీరఘట్టం వచ్చే విద్యార్థులు, వ్యాపారులకు ఇక్కట్లు తప్పడం లేదు. అలాగే పార్వతీపురం నుంచి వచ్చే నైట్‌హాల్ట్ బస్సు రద్దు చేయడంతో రాత్రి 9 గంటల తర్వాత పార్వతీపురం నుంచి వీరఘట్టం రావాలంటే నరకయాతన పడాల్సిందే.

కొత్త బస్సులున్నా వేయడం లేదు..

ఇటీవల పాలకొండ, పార్వతీపురం ఆర్టీసీ డిపోలకు కొత్త బస్సులు వస్తున్నాయని చెబుతున్న డిపో మేనేజర్లు వీరఘట్టం రూట్ వైపు కన్నెత్తి చూడడం లేదు. కొత్త బస్సులు వేసి ఒక ప్రణాళిక ప్రకారం ఈ రూట్‌లో నడిపితే అధిక ఆదాయం వస్తుందని.. ఈ రూట్‌లో బస్సు తిరుగుతుందని ప్రజలకు తెలిసేలోపే ఆ సర్వీసులు రద్దు చేస్తుండడంతో ఫలితం ఉండడం లేదని పలువురు చెబుతున్నారు.

విశాఖపట్నం బస్సు పునరుద్ధరించాలి..



వీరఘట్టం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సును ఏడాదిన్నర కిందట రద్దు చేశారు. దీనివల్ల నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు బస్సు సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వీరఘట్టం మీదుగా విశాఖపట్నం వెళ్లాల్సినవారు బస్సులేక నరకయాతన పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విశాఖపట్నం సర్వీస్‌ను నడపాలి.

– పన్నింటి శ్రీనివాసరావు, వీరఘట్టం

గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు..



పొల్ల, దోనుబాయి, నీలకంఠాపురం, మానాపురం, తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది గిరిజనులు వీరఘట్టం వస్తున్నారు.అయితే ఈ రూట్‌లో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ అంటూ నినాదాలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు ఈ రూట్‌లో బస్సును నడపాలి.

– జలుమూరు అమర్‌నాథ్, వీరఘట్టం

రాత్రి 9 దాటితే నరకమే..



విశాఖపట్టణం వెళ్లిన వారు రాత్రి 9 గంటల తర్వాత పార్వతీపురంలో దిగుతున్నారు. ఫస్ట్ షో సినిమాకు వెళ్లిన వాళ్లు రాత్రి 9.15 గంటలకు వస్తున్నారు. అయితే పార్వతీపురం నుంచి రాత్రి 9 గంటల తర్వాత నైట్‌హాల్ట్ బస్సు సర్వీసు లేకపోవడంతో వీరఘట్టం వైపు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తెల్లవారు జాము 5 గంటలకు పార్వతీపురం వెళ్దామన్నా బస్సులేక నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– శంభాన శ్రీనివాసరావు,వీరఘట్టం



నిరూపయోగంగా పశువైద్యశాల..

బత్తిలిలోని పశు వైద్యశాల భవనం నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు ఎంతో గుర్తింపు పొందిన పశు వైద్యశాల నేడు సిబ్బంది లేక తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ భవనంలో సంచారజాతి వారు ఉంటున్నారు. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించి వైద్యశాల తెరిచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– భామిని



మలుపు..ప్రమాదానికి పిలుపు

వీరఘట్టం – పాలకొండ సీఎస్పీ రహదారిలో చిదిమి జంక్షన్ వద్దనున్న మలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– వీరఘట్టం

ప్రమాదకర గోతులు..

భామిని మండలం ఘనసర కాలనీలో ఎంపీపీ స్కూల్ చుట్టు ప్రహరీ నిర్మిస్తామని తవ్విన గోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సమీప ప్రజలు ఈ గోతులు దాటుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ప్రమాదం తప్పదు..

– భామిని



ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు



రోడ్డులోని గోతులను తారు వేసి పూడ్చుతున్న సిబ్బంది

జియ్యమ్మవలస రూరల్: ఎట్టకేలకు మండలంలోని బీజేపురం నుంచి గెడ్డతిరువాడ మీదుగా ఇటుక వరకు బీటీ రోడ్డు మరమ్మతులు ఆదివారం చేపట్టారు. రోడ్డు పొడవునా ఉన్న గోతులను తారుతో నింపి సమతలం చేశారు. ఇదే దారిలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి జియ్యమ్మవలస మండలం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నామమాత్రంగా కాకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

మూలకు చేరిన బోరు..



పాలకొండ పట్టణంలో తాగునీటి ఇబ్బందులు నేటికీ కొనసాగుతున్నాయి. రూ.లక్షల ఖర్చు చేసి బోరు బావులు ఏర్పాటు చేసినా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వృథాగా మారుతున్నాయి. పట్టణంలోని రామ కళామందిర్ వీధిలో ఉన్న చేతి బోరు నిరుపయోగంగా మారింది. మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

24లోగా దరఖాస్తు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే వారు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల పరిధిలోని భద్రగిరి ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డింగ్, మోటార్ మెకానిక్, కోపా, డ్రెస్ మేకింగ్ తదితర ట్రేడులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికే ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కోర్సు పూర్తి చేసుకున్న వారికి కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో ప్రైవేటు కంపెనీల్లో పనిచేసేందుకు ఉద్యోగాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

బిల్లులు చెల్లించరూ..

సీతంపేట: మండలంలోని కుమ్మరిగండిలో చందాలతో రెండు బోర్లతో పాటు మినీ రక్షిత పథకం ఏర్పాటు చేసుకుని తాగునీటి సౌకర్యం కల్పించుకున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో 80 కుటుంబాలు ఉండగా ఒక్కో కుటుంబం రూ. 5 వేలు చందా ఇచ్చిందని.. ఐదేళ్ల కిందట రూ. 4 లక్షలతో తాగునీటి పథకం ఏర్పాటు చేసుకున్నామని.. అప్పట్లో బిల్లులు చెల్లిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇంతవరకు ఎవ్వరూ ఒక్క పైసా కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.



గ్రామస్తులు నిర్మించుకున్న మినీ రక్షిత ట్యాంక్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

సీతంపేట: మండలంలోని రోలుగుడ్డి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులకు హైటెన్షన్ విద్యుత్ తీగలతో ఉన్న స్తంభాలు ఒరిగిపోయాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

బెల్టు షాపులకు మద్యం సరఫరా నిలిపివేత

- వేలం పాటదారుల్లో ఆందోళన

సీతానగరం: ప్రభుత్వం లక్ష్యానికి మించి మద్యాన్ని అధిక మొత్తంలో విక్రయాలు చేయాలని సంకల్పించడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన బెల్ట్ షాపులు కీలకపాత్ర పోషిస్తున్నాయన్న విషయం జగమెరిగిన సత్యం. ప్రభుత్వం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను సీతానగరం కేంద్రంగా ఏర్పాటు చేయగా సర్కిల్ పరిధిలో గరుగుబిల్లి, బలిజిపేట, సీతానగరం మండలాలు న్నాయి. మండలానికి ప్రభుత్వం నిర్దేశించిన షాపులు నాలుగు లేదా ఐదువంతున ఉన్నాయి. అందునా గ్రామాల్లో జనాభా, మందు సేల్స్ ఆధారంగా బెల్ట్ షాపులు మాత్రం 60 నుంచి 70 వరకూ ఉండడం సహజమైపోయింది. పార్వతీపురం మన్యం జిల్లాలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్న సమయం లో సీతానగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సీతానగరం మండలంలో అంటిపేట, బూర్జ గ్రామాల్లో ఒక్కో షాపు వంతున, మండలకేంద్రం సీతానగరంలో రెండు మద్యం షాపులు ఉన్నాయి. మద్యం అలవాటున్న వారు షాపుల వద్దనే కొనుగోలు చేయాలని, బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు చేయవద్దని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారని బెల్ట్ నిర్వాహకులు చెబుతు న్నారు. ఇంతవరకూ బెల్ట్‌షాపులు నిర్వహించిన వాంతా బెల్ట్‌లు నిర్వహించరాదని ఆదేశించినట్లు తెలిసింది. ఒక్కో బెల్ట్‌షాపు నిర్వాహకుడు లక్షల్లో వేలం పాటద్వారా దక్కించుకున్న వారు మద్యం విక్రయించక పోవడంవల్ల గ్రామానికి కట్టాల్సిన సొమ్ము చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు.

ప్రత్యేకంగా సోదాలు

సీతానగరం సర్కిల్ పరిధిలో మూడు మండలాలుండగా సీతానగరంలో మద్యం బెల్ట్‌షాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేకించి సోదాలు చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మద్యం తాగే వారు మండల కేంద్రాల్లో ఉండే షాపులకు వెళ్లి మద్యం తాగాలంటే పోలీసుల కేసులతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని అంటున్నారు. ఎక్కడా బెల్టు షాపులు నిషేధించని ఎక్సైజ్ అధికారులు సీతానగరం మండలంలో నిషేధించడంలో ఉన్న అంతర్యం ఏమిటని అందరూ ప్రశ్నిస్తున్నారు.

సచివాలయ సిబ్బంది రికార్డులు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గుచ్చిమి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు శాఖలవారీగా విధులకు సంబంధించిన రికార్డులను అప్ టు డేట్ చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండల పంచాయతీ విస్తరణాధికారి కె.కుమారవర్మ అధ్యక్షతన గుచ్చిమి సచివాలయం ఉద్యోగులతో ఆదివారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్‌మాట్లాడుతూ ఈ నెల 21,22,23 తేదీల్లో జిల్లాలోని సచివాలయాల సందర్శనకు ఐఏఎస్ అధికారులు నిర్వహించే పర్యటనలో భాగంగా సీతానగరం మండలం గుచ్చిమి సచివాలయాన్ని సందర్శించడానికి వస్తున్నారన్నారు. ఈ మేరకు సచివాలయం పరిధి లో ఇంతవరకూ జరిగిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను శాఖల వారీగా ఉద్యోగులంతా రికార్డులను సిద్ధంగా ఉంచాలని కోరారు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర..!

పాలకొండ రూరల్: మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగియనున్నాయి. వచ్చే నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. నూతనోత్సాహంతో విద్యార్థులు ఉన్నత తరగతుల్లో చేరేందుకు బడిబాట పట్టనున్నారు. గడిచిన కొద్ది రోజులుగా సెలవుల కారణంగా పాఠశాలల ప్రాంగణాలపై పర్యవేక్షణ కొరవడడంతో వాటి పరిసరాలు వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. మండలంలోని 32 పంచాయతీల్లో అనేక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఇదే. ప్రస్తుతం అధికారులు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపడుతున్నారు. అయితే వీరు పల్లెల్లో పాఠశాలల వైపు కనీసం చూడడం లేదు. ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాలన్నీ చెత్తాచెదారాలతో నిండిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నరు.



పారిశుధ్య లోపం మధ్య కునారిల్లుతున్న భాసూరు ప్రభుత్వ పాఠశాల పరిసరాలు

పొంచి ఉన్న ప్రమాదం

భామిని: మండలంలోని బత్తిలి పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఎటువంటి రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలుకోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పార్టీ ఫిరాయించిన వారు రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ బీ ఫారంతో గెలిచి పార్టీ ఫిరాయించిన వారికి నైతికత ఉంటే వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు, మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాషరావు డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్వగృహంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో ముగ్గురు కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికై ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైపు చేరారని, వారంతా తమ పదవులకు, సభ్యత్వాలకు రాజీనామా చేయాలని కోరారు. పార్టీ మారిన వారికి వైఎస్సార్‌సీపీ ఎంతో మంచి స్థానం కల్పించిందని.. వారి ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఇంతచేసినా సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారిన వారు నేడు వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్ మాట్లాడుతూ.. నగర పంచాయతీలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇప్పలవలసలో దుర్గాదేవి గుడి ప్రతిష్ట

సీతానగరం: మండలంలోని ఇప్పలవలసలో ప్రజల సహకారంతో వంగపండు శంకరరావు, ఉషారాణిలు నిర్మించిన దుర్గ గుడి ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పెద్దల సమక్షంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు కర్రి పద్మారావు, కర్రి పద్మనాభం, మైలార భట్ల వెంకట ప్రసాదరావుశర్మ పర్యవేక్షణలో గుడి ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. భక్తులందరికీ అన్న ప్రసాదాల వితరణ ఏర్పాటు చేశామన్నారు.



గుడిలో పూజలు చేస్తున్న భక్తులు